జడివాన

◆ 11 మండలాల్లో మోస్తరు ◆ 20 మండలాల్లో చిరుజల్లులు

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణం పార్థసారధి నగర్‌లో నివాసాల మధ్య నిలిచిన వర్షం నీరు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుపాను ప్రభావంతో ఉమ్మడి అనంతపురం జిల్లా అంతటా జడివాన పట్టుకుంది. బుధవారం రాత్రి వరకు ఎక్కడా భారీ వర్షమైతే నమోదవలేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్ని మండలాల్లోనూ జడివాన కురిసింది. వర్షంతో జనం బయట తిరగాలంటే ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం నుంచి కొద్దిగా తెరపిచ్చినప్పటికీ మబ్బులు కమ్ముకునే ఉన్నాయి. తుపాను హెచ్చరికతో ప్రభుత్వం పాఠశాలలకు రెండు రోజులు సెలవులు ఇచ్చింది. గురువారం కూడా తుపాను ప్రభావం ఉంటుందని రెండు జిల్లాల కలెక్టర్లు వినోద్‌కుమార్, టిఎస్.చేతన్‌లు తెలియజేశారు. అవసరం అయితే తప్ప బయటకు రావొద్దని సూచించారు.

అనంతపురం జిల్లాలో మంగళవారం నాడు అన్ని మండలాల్లోనూ వర్షపాతం నమోదయింది. సగటున 11.7 మిల్లీమీటర్లు వర్షపాతం పడింది. ఇందులో అత్యధికంగా 20.2 మిల్లీమీటర్లు యల్లనూరు మండలంలో నమోదవగా, అత్యల్పంగా డీ.హీరేహాళ్‌లో రెండు మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కూడా ఒక మోస్తరు వర్షపాతం నమోదయింది. ఇందులో అత్యధికంగా కంబదూరు మండలంలో 29.8 మిల్లీమీటర్లు పడింది. కుందుర్పిలో 26.8 మిల్లీమీటర్లు, వజ్రకరూరులో 20.8 మిల్లీమీటర్లు, ఉరవకొండలో 20 మిల్లీమీటర్లు వర్షపాతం పడింది. అత్యల్పంగా బుక్కరాయసముద్రంలో మూడు మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. మొత్తం జిల్లాలో 31 మండలాలుండగా 11 మండలాల్లో ఒక మోస్తరు వర్షపాతం ఈ రెండు రోజులు నమోదయింది. 15 మిల్లీమీటర్ల నుంచి 64 మిల్లీమీటర్లలోపు పడే వర్షపాతాన్ని ఒక మోస్తరు వర్షపాతంగా వాతావరణ శాఖ లెక్కిస్తుంది. దీని ప్రకారం 11 మండలాల్లో ఈ రకమైన వర్షం పడింది. 2.5 మిల్లీమీటర్ల నుంచి 15.5 మిల్లీమీటర్లలోపు తేలికపాటి వర్షపాతంగా లెక్కిస్తారు. ఈ లోపు పడిన వర్షపాతం జిల్లాలో 20 మండలాల్లో ఉంది.

పంటలపై ప్రభావం

ఖరీఫ్ పంటలు నూర్పిడి దశకు వస్తున్న సమయంలో ఇటువంటి వాతావరణం పంటలపై ప్రభావం చూపే అవకాశాలు ఉండనున్నాయి. ప్రధానంగా కంది పంట పూత దశలో ఉంది. ఈసారి జిల్లాలో అత్యధికంగా ఒకటిన్నర లక్షల ఎకరాల్లో కంది పంట సాగై ఉంది. ఈ జడి వాతావరణంలో పూతపై తెగుళ్ల ప్రభావం ఉండే అవకాశముంది. అరటి పంటకు సిగటోమా తెగులు వచ్చే అవశాముందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దానిమ్మ పంటకు కూడా బ్యాక్టీరియా వ్యాపిస్తుందని హెచ్చరిస్తున్నారు. వీటి నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు.

ధర్మవరంలో 44.4 మిల్లీమీటర్ల వర్షపాతం

ధర్మవరం రూరల్ : ధర్మవరం మండలం లో మంగళవారం అర్థరాత్రి నుండి భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయం మధ్యాహ్నం కూడా ఎడతెరిపి లేకుండా జడివాన కురుస్తుండటం వల్ల ప్రజలు ఇళ్ల నుండి బయటకు రాలేక పోయారు. భారీ వర్షాల వల్ల ధర్మవరం మండలం పోతులనాగేపల్లి వద్ద చిత్రావతి నది ప్రవహిస్తూ ధర్మవరం చెరువులోకి నీరు చేరుతోంది. ఇది ఇలా వుంటే ఈ వర్షాలు వలన తుమ్మల గ్రామానికి చెందిన రైతులు పొలాల్లో మంగళవారం తొలగించిన వేరుశెనగ పంట పూర్తిగా తడిసిపోయింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ వర్షాలు వలన రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. వ్యవసాయ అధికారులు పంట పొలాలను పరిశీలించి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తడిసిన వేరుశనగ కాయలు : ధర్మవరం మండలంలోని మల్లకాల్వ గ్రామానికి చెందిన రైతు రాంమోహన్ రెడ్డి పట్టణ సమీపంలోని మార్కెట్ యార్డ్ కి వేరుశెనగ కాయలని తరలించి కొచ్చి ఇక్కడ అరబోసుకున్నాడు. మంగళవారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షం వలన వేరుశెనగ కాయలు పూర్తిగా తడిసిముద్దయ్యాయి. ఈసందర్భంగా రైతు రాంమోహన్ రెడ్డి మాట్లాడుతూ రాత్రి నుండి వర్షం భారీగా కురవడంతో రేకులు షెడ్ రంధ్రాల నుంచి వాన నీరు పడి పంట మొత్తం తడిసి పోయిందన్నారు. టార్పాలిన్ కవర్లను కప్పిన కూడా వేరుశెనగ కాయలను కాపాడుకోలేక పోయామన్నారు. అధికారులు తడిసిన వేరుశెనగ కాయలను పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వం ద్వారా న్యాయం చేయాలని కోరారు.

ఇళ్లలోకి వర్షపు నీరు.. ఇబ్బందుల్లో కాలనీవాసులు

బత్తలపల్లి : మండల పరిధిలోని సంజీవపురం గ్రామంలో ఇళ్లలోకి నీరు చేరుతోంది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం - కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని సంజీవపురం గ్రామంలో ఐదేళ్ల క్రితం జాతీయ రహదారి విస్తరణ పనుల్లో రోడ్డు ఎత్తు పెంచారు. దీంతో వర్షపు నీరు వెళ్లేందుకు దారిలేక కాలనీలోనే నిల్వ ఉంటోంది. ఈ సమస్యపై స్పందించే నాథుడే కరువయ్యారని సంజీవపురం ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎస్సీ కాలనీలో దాదాపు వంద కుటుంబాలు నివాసముంటున్నాయి. అందులో 500 మందికిపైగా జనాభా ఉంది.గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ ఉంటోంది. దీనికి తోడు కాలనీ పై భాగంలోని కాటమయ్య కొండ మీద నుంచి వర్షపు నీరు వచ్చి కాలనీలోకి చేరుతోంది. గతంలో కాలనీలో నుంచి రోడ్డు దాటుకొని గ్రామం బయటకు వెళ్లే నీరు, ఇప్పుడు రోడ్డు ఎత్తు పెరగడం వల్ల నీరు వెళ్లేందుకు దారి లేక నిల్వ ఉంటోంది. రోడ్డు వేసే సమయంలో కల్వర్టు ఏర్పాటు చేయకపోవడం వల్ల నీరు ముందుకు సాగడంలేదు. దీంతో లోతట్టులో ఉన్న కాలనీలోని ఇళ్లలోకి నీరు చేరుతోంది. దీంతో రాత్రి సమయంలో నిద్రలేని రాత్రులు గడుపుతున్నట్లు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పది ఇళ్లలోకి నీరు చేరి బియ్యం, ఇతరత్రా వస్తువులు తడిసిపోయినట్లు వారు వాపోయారు. సమస్యను స్థానికులు ఎంపీడీవో నరసింహనాయుడు, ఈవోఆర్డీ క్రిష్టప్ప దష్టికి తీసుకురావడంతో వారు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారని అయితే వారు ఎలాంటి పనులు చేయలేదని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. నీరు వెళ్లేందుకు డ్రైనేజీ తీస్తామని హామీ ఇచ్చి అటువైపు వచ్చి చూడలేదని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని లేనిపక్షంలో కాలనీ వాసులందరం కలిసి రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తామని హెచ్చరించారు. అక్కడికి స్పందించకపోతే అర్‌అండ్‌బి కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

అప్రమత్తంగా ఉండాలి :బత్తలపల్లి మండలంలో మంగళవారం రాత్రి నుంచి వర్షం కురిసింది. రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు చిన్న కుంటలు, చెక్ డ్యాంలకు నీరు వచ్చి చేరుతోంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు బత్తలపల్లి మండలంలో 31.4 మిల్లీ మీటర్ల వర్షపాతం, బుధవారం ఉదయం 8.30 నుంచి 12 గంటల వరకు 20 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఎఎస్‌ఒ కెఎస్ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. ఇదిలా ఉండగా చిన్నపాటి వర్షం వస్తే చాలు రోడ్లు నీటికుంటలను తలపిస్తున్నాయి. బత్తలపల్లిలోని ఆర్కి ఫంక్షన్ హాల్‌కు వెళ్లే దారిలోనూ, టీచర్స్ కాలనీకి వెళ్లే దారితో పాటు పలు వీధుల్లో రోడ్డుపై నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నదీ పరివాహక ప్రాంతాలను పరిశీలించిన అధికారులు

పరిగి : మండలంలో తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండటంవల్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయవలసిన బాధ్యత స్థానిక అధికారులపై ఉందని ఆర్డీవో ఆనంద్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. పరిగి మండలంలోని శ్రీరంగరాజుపల్లి వద్ద కర్నాటక ప్రాంతం నుండి జయమంగలినది ఉదతంగా ప్రవహించి గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని సమాచారం తెలుసుకున్న ఆర్డీవో, డీఎస్పీ పరిగిలో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీ రంగరాజుపల్లి గ్రామంలో జయమంగలి నది బ్రిడ్జ్‌ను పరిశీలించారు. నీరు ఉధృతంగా వస్తుండటంతో రాకపోకలను నిలుపుదల చేశారు. వరద నీరు పరిగి చెరువుకు చేరేందుకు తూముల మరమ్మతులపై స్థానిక తహశీల్దార్ హసీనా సుల్తానా ఎంపీడీవో శ్రీధర్ తో చర్చించారు. అనంతరం పరిగి చెరువు ట్యాంక్ బండ్ పరిశీలించి తూములు, చెరువుకట్ట మరమ్మతు పనులపై డిఇ లక్ష్మీనారాయణ స్థానిక రైతు సంఘం నాయకులు వెంకటరామిరెడ్డి రైతులతో మాట్లాడారు. ఎక్కువ నీరు పరిగి చెరువుకు చేరే అవకాశం ఉందని నీరు వృథా కాకుండా ముందస్తుగా మరమ్మత్తు పనులను పూర్తి చేయించాలని సూచించారు. ఎక్కడ ప్రజలు ఇబ్బందులు పడకుండా స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గోవిందరెడ్డి, సర్పంచి బాలాజీ, నాగభూషణం, డిఎస్‌ఎల్ శ్రీనివాసులు, చంద్ర , కంకర శ్రీనివాసులు, మహేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇల్లు

లేపాక్షి : మండలంలోని మామిడిమాకులపల్లిలో దళిత నారాయణప్పకు చెందిన ఇల్లు కూలిపోయింది. మూడు రోజుల నుంచి కురుస్తున్న జడివాన కు నేలమట్టం అయింది. ఇల్లు పడి పోయినప్పుడు అక్కడ ఎవరు లేక పోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

నేలకొరిగిన బొప్పాయి...

చిలమత్తూరు : మూడు రోజులుగా ఎడతెరపి లేని వర్షాలకు చిలమత్తూరు మండలంలో పంటలు దెబ్బతిన్నాయి. వేరుశనగ, మొక్క జొన్నతో పాటు వాణిజ్య పంటలైన బొప్పాయి పంట దెబ్బతింది. మండల పరిధిలోని వీరాపురంలో శివశంకర్ రెడ్డి అనే రైతు మూడు ఎకరాలలో బొప్పాయి పంటను సాగు చేశాడు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షం దాటికి సుమారు 50 చెట్లు నేలకొరిగాయి. వర్షం ఇలాగే కొనసాగితే మొత్తం చెట్లు నేలకొరిగి పూర్తిగా పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బొప్పాయి సరిగ్గా కోతకు వచ్చిన సమయం ఇలా జరగడం బాధకరమన్నారు. ఇప్పటికే సుమారు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందన్నారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర పరిశీలన చేసి మండలంలో రైతులకు తగిన జాగ్రత్తలను చెప్పడంతో పాటు ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

చెరువుకు గండి

సోమందేపల్లి : మండల పరిధిలోని నడింపల్లి గ్రామ చెరువుకు గండిపడి నీరు వృథా అవుతోంది. నడింపల్లి చెరువు తూము దగ్గర రంధ్రం ఏర్పడి నీరు వెళుతున్న విషయాన్ని స్థానికులు రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు బుధవారం చెరువుని సందర్శించి గండి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ చెరువు కింద సుమారు 600 ఎకరాలు సాగులో ఉందని ఇందులో 70 శాతం వరకు వరి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేశారని రైతులు చెప్పారు. చెరువుకు పెద్ద గండిపడి తెగిపోతే భారీ నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం అయినా ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదని నీరు అలాగే వెళ్తున్నాయని అన్నారు. కొందరు అధికారులు గురువారం ఇసుక బస్తాలు వేయిస్తామని చెప్పి వెళ్లిపోయారని గ్రామస్తులు చెప్పారు. సంవత్సరాల కాలంగా చెరువులు మరమ్మతులు చేపట్టని కారణంగా ఇలాంటి ఘటనలు ఏర్పడి నీరు వృథా అవుతోందని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెరువుకు మరమ్మతులు చేపట్టి నీటి వథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ డిఇని వివరణ కోరగా,గ్రామస్తుల సమాచారం మేరకు నడింపల్లి చెరువును బుధవారం పరిశీలించామన్నారు. చెరువు కట్టకు గండి పడలేదని కేవలం తూము ప్రాంతంలో చిన్నపాటి రంధ్రం పడిందని చెప్పారు. రంధ్రంలో వన్ హెచ్‌పి మోటార్ పంప్ సెట్ లో వచ్చే నీటి కంటే తక్కువగా వెళుతోందన్నారు. చెరువు కింద ఉన్న పంట పొలాలకు ఎలాంటి ప్రమాదం లేదని బుధవారం అధిక వర్షం కారణంగా మరమ్మతు చేపట్టలేకపోయామని చెప్పారు. గురువారం ఇసుక సంచులతో రంధ్రాన్ని పూడ్చివేస్తామని తెలిపారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

ధర్మవరం రూరల్ : వర్షం కారణంగా పాత మిద్దెల ద్వారా ప్రమాదాలు జరుగుతాయన్న ఉద్దేశంతో గత రెండు రోజుల క్రితం ఆర్డీవో మహేష్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంట్రోల్‌రూంకు వచ్చిన సమాచారం మేరకు బుధవారం ధర్మవరం మున్సిపాలిటీలోని 12వ వార్డులోని కోటలో గల పాత ఇంటిని సచివాలయ అధికారులు పరిశీలించారు. వర్షాల కారణంగా ఆ ఇంటి చుట్టుపక్కల ఉన్న కాలనీవాసుల ఫిర్యాదు మేరకు వార్డును సందర్శించి ఇంటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి ఇన్‌ఛార్జి సమీర్, షేక్షా, దాదు , ఇర్ఫాన్, సచివాలయ సిబ్బంది,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

చెరువుకట్ట పరిశీలన

కదిరి టౌన్ : తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కదిరి రూరల్ మండలం కుమ్మర వాండ్ల పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోనిఇటిక రాయ చెరువుకు సంబందించిన కట్టను అధికారులు బుధవారం పరిశీలించారు. తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిడిఒ పోలప్ప, ఇరిగేషన్ అధికారి మహేష్ పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రజలు పాత మిద్దెల్లో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా ఇబ్బంది తలెత్తితే టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు విజయేంద్ర ప్రసాద్, కేదార్ నాథ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ను పరిశీలించిన కలెక్టర్

పుట్టపర్తి క్రైమ్ : వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అల్పపీడన పరిస్థితుల సమాచారాన్ని తెలుసుకొనేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టీవీద్వారా ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారాన్ని తెలపాలని కంట్రోల్ రూమ్ లో విధులు నిర్వర్తిస్తున్న ఉన్న సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మూడు గంటలకు ఒకసారి సైక్లోన్ అప్డేట్స్ వస్తున్నాయని, రెండురోజులు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. భారీ వర్షం అంటే 20 మిల్లీమీటర్ల నుంచి 80 మిల్లీమీటర్ల వరకు వచ్చే అవకాశం ఉందనితెలిపారు. జిల్లాలో కలెక్టరేట్లో విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

పుట్టపర్తి రూరల్ : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జిల్లాలోనే ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వి.రత్న సూచించారు. ఈ వర్షాల కారణంగా పాతబడిన నివాసాల్లో ఉండే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. సురక్షమైన ప్రాంతంలో ఉండాలని, లోతట్టు చెరువులు వంకల సమీప ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేస్తూ అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. సత్యసాయి జిల్లాలో కూడా భారీ వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉన్నందున, ఏవైనా చెరువులు, కాలువలు, వంకలు,కాజ్‌వేలు వర్షాల వలన దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముందస్తు సమాచారం సేకరించి ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే : మరో రెండు రోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రాణ, ఆస్తి పంట నష్టం జరగకుండా అధికార యంత్రాంగానికి ఆదేశాలు ఇవ్వాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు. ఈ మేరకు ఆమె బుధవారం పుట్టపర్తి నగరంలో చిత్రావతి పరివాహక ప్రాంతంలో ఉన్న కాలనీ వాసులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న ముంపు వాసులను సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా ప్రజలను అప్రమత్తత చేయాలని రెవెన్యూ ,మునిసిపల్ అధికారులను ఆదేశించారు. అవసరమైతే ముందస్తుగా రెస్క్యూ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు జరగకుండా అధికారులకు తగు సూచనలు ఇవ్వాలని కోరారు. పట్టణంలో ముంపు ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని ఎమ్మెల్యే కోరారు. రాత్రి వేళల్లో సైతం అధికారులతో గస్తీ ఏర్పాటు చేయాలని సూచించారు. చిత్రావతి నది ముంపు పరివాహక ప్రాంతాలను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను ఆయన అప్రమత్తం చేశారు. భారీ వర్షాల కారణంగా పుట్టపర్తి చిత్రావతి బ్రిడ్జి, కోవెలగుట్టపల్లి, యనమల పల్లి ,రాయలవారిపల్లి, ప్రాంతాలలో చిత్రావతి నదిలోకి వస్తున్న ప్రవాహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామకోటి ఆదినారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చిలమత్తూరులోని పొలాలలో పడిపోయిన బొప్పాయి చెట్లు

లేపాక్షిలోని మామిడికులపల్లిలో కూలిన ఇంటి వద్ద బాధితుడు

సోమందేపల్లిలోని నడింపల్లి చెరువుకట్ట తూము నుంచి వృధాగా వెళుతున్న నీరు

అనంతపురంలోని ఓ మద్యం షాపు వద్ద జరుగుతున్న అమ్మకాలు

రూ.99 క్వార్టర్ ఉత్తిదే..!

◆ పాత బ్రాండ్లు... పాత మద్యం..
◆ ధరల తగ్గింపు ఒట్టి ప్రచారమే
◆ లిక్కర్ అమ్మకాలపై మద్యంబాబుల పెదవివిరుపు

పాత ధరతోనే ఉన్న క్వార్టర్ బాటిళ్లు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం, యల్లనూరు

గతంలో ప్రభుత్వమే మద్యం షాపులను నడిపింది. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే రూ.99కే నాణ్యమైన మద్యం ఇస్తామంటూ కూటమి ప్రభుత్వం విస్తతంగా ప్రచారం చేసింది. దీన్ని నమ్మి మద్యం ప్రియులు కూటమి ప్రభుత్వానికి గంపగుత్తగా ఓట్లు వేసి గెలిపించారు. అనుకున్నట్లుగానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చెప్పినట్లుగానే గత ప్రభుత్వం తెచ్చిన మద్యం పాలసీని రద్దు చేసి పాత పద్ధతిలో టెండర్లను పిలిచి మద్యం షాపులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం బుధవారం మద్యం షాపులను తెరిచింది. రూ.99కే నాణ్యమైన మద్యం ఇస్తారని మద్యం ప్రియులంతా ఉదయం 10 గంటలకే జోరు వానలో తడుస్తూ మద్యం షాపుల వద్దకు చేరుకున్నారు. గతంలో ఉన్న బ్రాండ్లు, అదే ధరకు అమ్ముతుండటంతో నిరుత్సాహ పడ్డారు. కొత్త మద్యం పాలసీ ప్రకారం షాపులను ప్రారంభించామని, పాత స్టాకు అయిపోగానే రూ.99 క్వార్టర్ మద్యం ఇస్తామంటూ షాపుల యజమానులు చెబుతున్నారు. ధరలు తగ్గిస్తామని చెప్పి తమతో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు మాట తప్పడం ఎంతవరకు సమంజసం అంటూ మద్యంబాబులు షాపుల వద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు.

బార్లలో తగ్గిన ధరలు

ప్రయివేటు మద్యం షాపుల్లో అమ్మకాలు ప్రారంభం కావవంతో ఉన్న ఫలంగా బార్ల యజమానులు ధరలను తగ్గించారు. రూ.99కే క్వార్టర్ అని ప్రచారం జరగడంతో షాపుల వద్దకు మద్యంబాబులు వెళ్లారు. దీంతో బార్ల యాజమాన్యాలు ఒక్కసారిగా క్వార్టర్ బాటిల్‌పై రూ.50 వరకు తగ్గించారు. అయితే షాపుల్లో పర్మిట్ రూములకు అనుమతి లేకపోవడంతో పాటు ధరను తగ్గించకపోవడంతో బార్లలో రద్దీ కన్పించింది.

తల్లి మృతదేహం వద్ద బేలచూపులు చూస్తున్న పిల్లలు, విరిగిన కాలుకు కట్టుతో నరసింహులు

కష్టాల కడలిలో నిరుపేద కుటుంబం

క్యాన్సర్‌తో ఇల్లాలు మృతి, ఇంటి పెద్దకు ప్రమాదం

మృతురాలి దహన సంస్కారాలకు పైసలు కరువు

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని రెడ్డిపల్లిలోని ఓ దళిత కుటుంబం కష్టాల కడలిలో కూరుకుపోయింది. ఒక పక్క ఇంటి ఇల్లాలు కాన్సర్‌తో మృతిచెందితే, మరో పక్క ఇంటి పెద్దాయనకు ప్రమాదంలో కాళ్లు విరిగాయి. మృతిచెందిన మహిళకు దహన సంస్కారాలు చేయడానికి చేతిలో చిల్లిగవ్వ లేకపోవటంతో ఇంటి ముందు మృతదేహాన్ని ఉంచుకుని ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. ఈ విషయం సోషల్‌మీడియాలో హల్‌చల్ కావటంతో మానవతావాదులు మందుకు వచ్చారు. తమకు తోచిన సాయాన్ని అందించారు. ఆ ఇంటికి చెందిన పిల్లల చదువుకు ఓ స్వచ్ఛంధ సంస్థ ముందుకు వచ్చింది. అందుకు సంబందించిన వివరాలు...

మండలంలోని రెడ్డిపల్లికి చెందిన దళిత నరసింహులుకు భార్య దుర్గమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలికి వెళితే కాని పూట గడవని పరిస్థితి ఆ కుటుంబానిది. ఈ క్రమంలో దుర్గమ్మ క్యాన్సర్ బారిన పడింది. ఆమె భర్త నరసింహులు అప్పులు చేసి భార్యను కాపాడుకోవడం కోసం బెంగుళూరు ఆసుపత్రిలో చికిత్స చేయించాడు. ఎలాంటి ప్రయోజనం కన్పించలేదు. ఈ నేపథ్యంలో తన భార్యను తన పుట్టినిల్లు కర్నాటక రాష్ట్రం పావగడ తాలూకా నాన్నగానిపల్లిలో వదిలి స్వగ్రామానికి వచ్చి భార్య వైద్యం కోసం అప్పు చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. ఈలోగా దుర్గమ్మ ఆరోగ్యం ఆందోళన కరంగా ఉందని భార్య తరుపున వారి నుంచి నరసింహులుకు మంగళవారం ఫోన్ వచ్చింది. దీంతో నరసింహులు తన భార్య పుట్టినింటికి వెళ్లడానికి మంగళవారం బయలు దేరాడు. రెడ్డిపల్లి నుండి పావగడకు వెళ్లి భార్య వారి గ్రామానికి వెళ్ళడానికి ఆటో కోసం అక్కడ ఉన్న గోడ క్రింద కూర్చొని ఎదురు చూస్తున్నాడు. ఆ సమయంలో గోడ కూలి నరసింహులుపై పడింది. దీంతో అతని రెండు కాళ్లు విరిగాయి. ఇంతలోనే దుర్గమ్మ మృతిచెందిందని సమాచారం అందింది. దీంతో మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకువచ్చారు. ఇంటి ముందర మృతదేహాన్ని ఉంచారు. అయితే దుర్గమ్మ దహన సంస్కారాలకు కూడా వారి వద్ద డబ్బులు లేవు. దీంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. ఒక పక్క ఇంటి ముందర అమ్మ మృతదేహం, మరో పక్క కాళ్లు విరిగిన తండ్రి మంచాన పడి ఉండటాన్ని చూస్తున్న నరసింహులు ఇద్దరు చిన్న పిల్లలు అనన్య, నందీష్ చేస్తున్న రోదనలు చూపరులను కంట తడి పెట్టించాయి. ఈ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీంతో పలువురు అధికారులు, సామాన్య ప్రజలు స్పందించారు. అప్పటికప్పుడు దాదాపు రూ.50 వేల వరకు బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా మృతురాలి కుమారుడు నందీష్‌ను చదివించడానికి హిందూపురం సాయిరాం ట్రస్ట్ ముందుకు వచ్చింది. విద్యార్థి ఎంతవరకు చదివితే అంతవరకు విద్యను, భోజన సదుపాయాలు ఏర్పాటు చేపడుతామని సభ్యులు మధుసూదన్ తెలియజేశారు. విషయం తెలుసుకున్న రొద్దం ఎస్ఐ నరేంద్ర గ్రామానికి వెళ్లి బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు.

అత్యాచార బాధితులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

చిలమత్తూరు మండలంలో అత్యాచారానికి గురైన అత్తా కోడలు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి వారికి శిక్ష వేయడానికి ప్రత్యేక కోర్టుకు విజ్ఞప్తి చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అత్యాచారానికి గురి అయిన కుటుంబాన్ని ఆదుకోవడం ప్రభుత్వ ప్రధమ కర్తవ్యమని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నుండి బయటికి రాగానే వారు ఎక్కడికి వెళ్లాలి, ఎలా బతకాలన్న పరిస్థితి ఏర్పడిందన్నారు. వారికి తక్షణం ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించాలన్నారు. అదేవిధంగా లేబర్ యాక్ట్ ప్రకారం అధికారులు వెంటనే స్పందించలేదని ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రజాశక్తి www.prajasakti.com

షరతులు పెట్టి.. రాయితీ ఎగ్గొట్టి..!

పేరుకే ఉచిత విద్యుత్
ఎస్సీ,ఎస్టీ కాలనీలకే విద్యుత్తు రాయితీ అంటూ మెలిక

ప్రజాశక్తి-పెనుకొండ

దళితులకు ఉచిత విద్యుత్ పథకం నీరుకారిపోయింది. అనేక షరతులు పెట్టి రాయితీలు ఎగ్గొడుతున్నారు. ఉచిత కరెంటు వినియోగించుకోవాలంటే ఎస్సీ, ఎస్టీకాలనీల్లో నివాసాలుండాలని అప్పుడే ఉచిత విద్యుత్తు అమలౌతుందని మెలిక పెట్టారు. దీంతోపాటు అనేక షరతులు విధించారు. ఆకాలనీల్లో ఉండేవారికి తప్ప మిగిలిన వారికి ఉచిత కరెంటు సరఫరా అమలు కాలేదు. ఈ విద్యుత్తు పొందాలంటే ఎస్సీ కాలనీల్లోనే ఉండాలా.. ఇది కులవివక్షకు అవకాశం ఇవ్వడం కాదా? అని ఆయా వర్గాలు ఆగ్రహం చేస్తు న్నాయి. కూటమి ప్రభుత్వమైనా తమకు న్యాయం చేస్తుందా?లేదా? అని అయోమయంలో రాయితీ విద్యుత్తు కోల్పోయిన ఎస్సీ,ఎస్టీల కుటుంబాలు ఆశతో ఎదురు చూసున్నాయి.

పెనుకొండ పట్టణ పరిధిలో ఏడుఇళ్ల కాలనీలో రామకృష్ణ అనే ఓదళితుడు నివాసం ఉంటున్నాడు. అతడి నివాసం ఉంటున్న సర్వీసుకు కొన్ని నెలల పాటు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇచ్చారు. ఆరునెలల క్రితం విద్యుత్తు అధికారులు ఆ దళితుని సర్వీసు ఎస్సీ కాలనీలో లేదని ఇతర ప్రాంతంలో ఉంటూ ఉచిత విద్యుత్తు వాడినట్లు గుర్తించి సర్వీసు తొలగించారు. అప్పటి నుంచి ఆ దళితుడు ప్రతి నెలా రూ.400 నుంచి రూ.500 వరకూ విద్యుత్తు బిల్లు చెల్లిస్తున్నాడు.

రంగానాయక్ అనే గిరిజనుడు ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతడి నివాసం ఉంటున్న ఇంటి కరెంటు సర్వీసుకు 4నెలలు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తుఇచ్చారు. ఎస్టీ కాలనీలో లేకుండా మరో కాలనీలో ఉంటూ ఉచిత విద్యుత్తు వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించి ఉచిత విద్యుత్తు సర్వీసును రద్దు చేశారు. ప్రస్తుతం ఆ గిరిజనుడు 200 యూనిట్లు లోపే విద్యుత్తు వాడుతున్నా ఎస్టీ కాలనీలో లేనందుకు విద్యుత్తు బిల్లు కడుతున్నాడు.

నిబంధనల పేరుతో 14వేల సర్వీసులు తొలగింపు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న 14 వేల మంది ఎస్సీ, ఎస్టీల నివాసాలకు రాయితీవిద్యుత్తు సరఫరాను నిబంధనల పేరుతో నిలిపివేశారు. వీరి సర్వీసులకు కొన్ని నెలల పాటు రాయితీ సరఫరా ఇచ్చినప్పటికీ తర్వాత ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నివాసం ఉండకుండా ఇతర ప్రాంతాల్లో నివాసాముంటూ రాయితీ విద్యుత్తును పొందుతున్నారని విద్యుత్తు అధికారులు గుర్తించారు. ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో ఉండే వారికి మాత్రమే రాయితీ విద్యుత్తు సరఫరా ఇస్తూ మిగిలిన ప్రాంతాల్లో ఉండే వారందరి నివాసాలకు రాయితీ కరెంటు సరఫరా నిలిపివేశారు. మిగిలిన వారంతా తమ సొంత డబ్బుతో విద్యుత్తు బిల్లులు కడుతున్నారు.

ఉచిత విద్యుత్తు సర్వీసులు..

ఉమ్మడి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో 1,28,814 ఎస్సీ విద్యుత్తు సర్వీసులుండగా ఇందులో 1,04,156 సర్వీసులు నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తును వినియోగించారు. అలాగే 36,190 ఎస్టీ విద్యుత్తు సర్వీసులుండగా ఇందులో 26,361 సర్వీసులు నెలకు 200 యూనిట్లు రాయితీ పొందుతున్నారు.

తొలగించినవి...

పెనుకొండ 619, కదిరి 1538, పుట్టపర్తి 163, మడకశిర 210తో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు పట్టణ, మండల కేంద్రాల్లో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో నివాసాలుంటూ నెలకు 200 యూనిట్లు విద్యుత్తు రాయితీ పొందుతున్న దాదాపు 14 వేల ఎస్సీ,ఎస్టీ సర్వీసులకు రాయితీ అమలు నిలిపివేశారు. ఇతర ప్రాంతాల్లో ఉండి ఉచితంగా కరెంటు వాడిన వారి వివరాలను గుర్తించి వారు ఎన్ని నెలల కరెంటు వాడారో పరిశీలించి బిల్లులు వసూలు చేశారు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు..

రాయితీ విద్యుత్తు పొందే అర్హత ఉండి, ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో నివాసం లేరు అనే సాకుతో రాయితీ తొలగించిన వారంతా కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో నివాసం లేనంత మాత్రనా తాము రాయితీ విద్యుత్తుకు అర్హులు కాదా? అని వారు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించి ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో నివాసం లేని వారికి కూడా పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎస్సీ,ఎస్టీలకు ఉచిత విద్యుత్తు అందించాలి

అర్హత ఉన్న ప్రతి ఎస్సీ,ఎస్టీ కుటుంబానికి ఉచిత విద్యుత్తు పథకం అమలు చేయాలి. కేవలం ఎస్సీ, ఎస్టీ కాలనీ ల్లో నివాసం ఉంటేనే ఉచిత విద్యుత్తుకు అర్హులు అనడం భావ్యం కాదు. కాలనీల్లో నివాసం లేనంత మాత్రన వారు దళితులు, గిరిజనులు కారా?.

హరి,
సిపిఎం నాయకులు

19న జాబ్‌మేళా

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 19న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వెంకట సురేష్ బాబు, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి బి. హరికృష్ణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకుల కొరకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ జాబ్ మేళా ధర్మవరం పట్టణంలోని తారకరామాపురం గుట్ట కింద పల్లి లో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసి 18 నుండి 35 సంవత్సరాల లోపు ఉన్నవారు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని చెప్పారు.ఉద్యోగాలకు ఎంపికైన వారు హైదరాబాదు, బెంగళూరులో ఉద్యోగము చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా తో పాటు ఆధార్ కార్డు, విద్య అర్హత పత్రాలు తీసుకొని 19వ తేదీ ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9182288465కు సంప్రదించాలని కోరారు.

హాస్టళ్ల తనిఖీ

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల కేంద్రంలోని బి.సి. బాలికల, బాలుర వసతి గహాలను తహాశీల్దార్ నీలకంతారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. బాలికల వసతిగృహం పాత అద్దె భవనంలో నిర్వహిస్తున్నందున ప్రస్తుత వర్షాలకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి రావడంతో హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బాలికల వసతిగృహంలో 165 మంది ఉన్నారని ఇరుక గదులతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విషయం ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి హాస్టల్ భవన మార్పునకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిసి బాలికల హాస్టల్ వార్డెన్ సులోచన, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా మమతా దేవి

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఎంపీడీవోగా మమతా దేవి బుధవారం బాధ్యతలు స్వీక రించారు. ఈమె ధర్మవరం మండల అభివద్ధి అధికారి కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సోమందే పల్లిలో ఎంపీడీవోగా బాధ్యతలు స్వీక రించారు. బాధ్యతలు చేపట్టిన మమతా దేవిని కార్యాలయ సిబ్బంది పూలమాలలు శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రామాంజనేయులు, శైలజ, సోమశేఖర్, అరుణ, రమేష్, శారద, శాంతి, శివశంకర్‌నాయక్, సీనియర్ అసిస్టెంట్ భీమలింగ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త నిరసన

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటరీ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఒక రోజు నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సిఐటియు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు జెవి.రమణ, టి.అయూబ్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటరీ కార్మికుల సమస్యలను రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి స్కూల్స్ శానిటరీ వర్కర్స్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 21న రాష్ట్ర వ్యాప్తంగా ఎంఇఓ కార్యాలయాల వద్ద ఒకరోజు దీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. శానిటరీ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం ఏర్పాటు చేయాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర సమస్యల పరిష్కారానికై రాష్ట్ర వ్యాప్తంగా ఒకరోజు దీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. ధర్మవరంలో నిర్వహించే ఈ నిరసన దీక్షకు అనుమతి ఇవ్వాలని ఎంఇఒకు నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఐ.లక్ష్మీదేవి, ఎస్.నాగవేణి తదివతరులు పాల్గొన్నారు.

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ధర్మవరంలో మద్యం దుకాణంపై దాడి

ధ్వంసం చేసిన ఫర్నీచర్

పగులకొట్టిన బీరు సీసాలు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలోని ఎర్రగుంట సర్కిల్‌లో వైసిపి పట్టణ అధ్యక్షులు బాలిరెడ్డికి చెందిన మద్యం దుకాణంపై మంగళవారం అర్ధరాత్రి సమయంలో కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ విషయంపై దుకాణ యజమాని బాలిరెడ్డి బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మంగళవారం రాత్రి పదిగంటల సమయంలో మద్యం స్టాకు అంతా దుకాణం లో పెట్టించి వెళ్లిన తరువాత కొందరు వ్యక్తులు వచ్చి దుకాణం బయట కాపలాగా వున్న వాచ్‌మెన్‌ను బెదిరించి, దుకాణం తాళాలు బద్దలు కొట్టి లోనికి చొరబడి మద్యం సీసాలను, సిసి కెమెరాలను, ప్రభుత్వానికి చెందిన కంప్యూటర్‌ను ధ్వంసం చేశారని వాపోయారు. రెండు మూడు రోజుల నుండి కొందరు వ్యక్తులు ఫోన్లు చేస్తూ మద్యం దుకాణాన్ని తమకు గుడ్‌విల్‌కు అప్పచెప్పాలని బెదిరిస్తున్నారని అన్నారు. దీంతో తాము కొన్ని రోజులు తరువాత మాట్లాడుకుందామని చెప్పామని అయితే ఇంతలోనే ఇలా దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ దాడిలో సుమారు పది లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని ఈ దాడికి కారణమైన వారిపై పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మద్యం దుకాణాన్ని బుధవారం ఉదయం పదిగంటలనుండి ఒకటో పట్టణ పోలీసుల భద్రత నడుమ ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం కుళ్లాయప్ప, చౌడప్ప, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..!

చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు
నిర్లక్ష్యం నీడలో విద్యుత్ అధికారులు

రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి-హిందూపురం

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వెనుక పెను ప్రమాదం దాగి ఉంది. చిన్నపాటి నిర్లక్ష్యం పెను ప్రమాదాన్ని కలిగించే పరిస్థితి నెలకొంది. కేవలం మూడు అడుగుల ఎత్తులో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు బయటకు కనిపించేలా విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. ఆ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ ఎలాంటి కంచె ఏర్పాటు చేయక పోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. నిత్యం వందలాది మంది వాహన చోదకులు, స్కూల్ బస్సులు, స్కూల్ పిల్లలు సైకిల్ మీద తిరిగే రహదారిలో ఈ విద్యుత్ నియంత్రిక ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఆ విద్యుత్ నియంత్రికకు పక్కనే రహదారి మీద నీటి నిల్వ. అది కాస్తా విద్యుత్ తీగలకి తాకిందో అంతేసంగతులు. స్కూల్ బస్సు, వాటర్ ట్యాంకర్, ఏ ఇతర వాహనాలు కొద్దిపాటిగా తాకినా పెను ప్రమాదం జరిగే ప్రమాదం ఉంది.హిందూపురం పట్టణంలోని డిబి కాలనీ ఎస్ డి జి ఎస్ డిగ్రీ కళాశాల వెనుక ప్రహరీ పక్కనున్న రహదారిలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ దాని విద్యుత్ తీగలు మూడు అడుగుల ఎత్తులో ఉండడం ఒక ఎత్తైతే దాని పక్కనే మట్టి రోడ్డు ఉంది. వర్షం పడిందో ఆ మట్టి రోడ్ లో నీరు నిల్వ ఉంటుంది. వాహనదారులు, చోదకులు ఆ నీటిలోనే వెళ్లాల్సిన దుస్థితి. ఆ ట్రాన్స్ ఫార్మర్ రోడ్డుకు ఆనుకుని ఉండడంతో స్కూల్ పిల్లలు, వృద్ధులు ఏమాత్రం ఏమరపాటుకు గురైనా ట్రాన్స్ ఫార్మర్ తీగలపై పడాల్సిందే. రోడ్డుమీద నడుచుకుంటూ వెళ్లినా ట్రాన్స్ ఫార్మర్ తీగలు తగిలే విధంగా ఉన్నాయి. విద్యుత్ అధికారులకు కాలనీవాసులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారుర నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ కంచె వేయించాలని లేదా ట్రాన్స్ ఫార్మర్ అయినా మరోచోటకు మార్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని మేడాపురం గ్రామంలో బుధవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మేడాపురం పంచాయతీ కేంద్రంలో రూ. 60లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బుక్కపట్నం : గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి మండల నాయకులు పేర్కొన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో రోడ్ల నిర్మాణాలను భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగలక్ష్మి రాజు, ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్ షాబుద్దీన్, నాయకులు జంగం వెంకట్రాముడు, మాజీ ఎంపీపీ బాలు, మీసాల మురళి, అబ్దుల్ వాజిద్, సుధీర్, మంజు, పంచాయతీ కార్యదర్శి సిద్ధిక్ భాష, ఉపాధి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తచెరువు : మండల పరిధిలోని కోడపగానిపల్లె గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు శివ, శ్రీరాములు, రఘుపతి, సర్పంచి అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మద్దిమడుగులో సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లక్ష్మిదేవి, ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని గుడ్డం పల్లి తండా, మంగళ మడక, పొడరాళ్ల పల్లి పంచాయతీలలో సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలంలోని సంగాల, అప్రాచెరువు, ఈదుల ముష్టూరు పంచాయతీలలో సర్పంచులు కంచనగారి రాజశేఖర్‌రెడ్డి, మొర్రెడ్డిగారి శారదమ్మ, బత్తినన్న అధ్యక్షతన పలెల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిసి రోడ్ల నిర్మాణాకలు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహనాయుడు, ఇఒఆర్‌డి కిష్టప్ప, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గాయత్రి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : మండలంలోని వేపమాని పేట, పెద్దన్నవారి పల్లి, గుండువారి పల్లి గ్రామ పంచాయతీల్లో బుధవారం నిర్వహించిన పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామానాయక్, ఎపిఒ హరున్‌రషీద్, సర్పంచి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భార్యపై భర్త దాడి

ప్రజాశక్తి - ధర్మవరంరూరల్

మండల పరిధిలోని నాగలూరు గ్రామానికి చెందిన వ్యక్తి తన భార్యపై దాడి చేశాడు. గ్రామానికి చెందిన శంకర, జానకి దంపతులు. బుధవారం వీరి మధ్య గొడవ జరిగింది. కుటుంబకలహాలతో మాటామాటా పెరిగిన సమయంలో అప్పటికే మద్యం మత్తులో వున్న శంకర్ అక్కడే వున్న కర్ర తో భార్యపై దాడి చేసాడు. ఈ దాడిలో ఆమె తలపై గాయాలయ్యాయి, చికిత్స నిమిత్తం ఆసుపత్రి కి తరలించారు.

ఎరువుల ఐచర్ వాహనం బోల్తా

ప్రజాశక్తి - అగళి

మండలంలోని పి.బ్యాడిగెర, హుళ్లెకెర గ్రామాల మధ్య జాతీయ రహదారిపై మలుపులో ఐచర్ వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. బుధవారం ఉదయం పావగడ నుంచి శిర వైపు వెళుతున్న ఎరువుల ఐచర్ వాహనం మలుపు రోడ్డు వద్ద బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఇసుక టిప్పర్లు పట్టివేత

ప్రజాశక్తి -బత్తలపల్లి

మండలంలోని చిత్రావతి నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న. రెండు టిప్పర్లు, ఒక ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిఐ ప్రభాకర్ ఆదేశాలతో ఎఎస్ఐ సోమశేఖరమూర్తి తన సిబ్బందితో కలిసి జాతీయ రహదారిపై లింగారెడ్డిపల్లి క్రాస్ వద్ద ఈ వాహనాలను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని గాజులవారిపల్లి పెద్ద తండా కు చెందిన కాజా నాయక్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచుకున్న 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. గ్రామాల సందర్శనలో భాగంగా గాజులవారిపల్లి పెద్ద తండాలో పర్యటించిన తమకు వచ్చిన సమాచారం మేరకు కాజా నాయక్ ఇంటిలో సోదాలు నిర్వహించి 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడి అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ తిరుమలరెడ్డి శ్రీనివాసులు తెలిపారు.

యువకుడికి విద్యుత్ షాక్

ట్రాన్స్‌కో అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ దగ్గర యువకుడు బుధవారం విద్యుత్ కరెంట్ షాక్‌కు గురయ్యాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల జరిగిన ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర ట్రాన్స్‌కో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫైబర్ నెట్ లో పనిచేసే యువకుడు స్థానిక బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ పక్కన ఉన్న కరెంటు స్తంభం వద్ద నిలిపిన తన బైక్ తీయడానికి వెళ్లగా విద్యుత్ షాక్ కు గురయ్యాడు. స్తంభానికి చుట్టి వదిలేసిన కరెంటు తీగ నుండి విద్యుత్ ప్రసారం అవుతుండటంతో ఆ యువకుడికి షాక్‌కు గురయ్యాడు. అది గమనించిన స్థానికులు వెంటనే అతడిని కర్రతో కొట్టి ప్రాణాపాయం నుండి రక్షించారు. విషయం తెలుసుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి బాధితుడితో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలం కావడంతో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదం జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే స్పందించిన అధికారులు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి డేంజర్ బోర్డును ఏర్పాటు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఫ్రీహోల్డ్ భూముల అక్రమాలపై విచారణ జరిపించండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని కోడపగానిపల్లె పొలంలో గత ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ భూముల జాబితాలో అనర్హుల పేర్లు అధికంగా చేర్చారని వాటిపైన విచారణ నిర్వహించాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ కోరారు. ఆ గ్రామానికి చెందిన రైతుల ఆధ్వర్యంలో తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అసైన్మెంట్ భూములకు పట్టాలు ఇచ్చి 20 సంవత్సరాలు పూర్తి అయిన వాటికి రిజిస్ట్రేషన్ భూములుగా మార్చాలని గత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే అక్కడ రాజకీయ నాయకులు వైసిపికి చెందిన అనర్హుల పేర్లను జాబితాలో చేర్చారన్నారు. అన్ని అర్హతలు ఉన్న టిడిపి మద్దతు దారుల చెందిన రైతుల పేర్లను జాబితాలో చేర్చలేదన్నారు గతంలో ఎందుకు చేర్చలేదని రైతులు అడిగితే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారని ఆరోపించారు. తహాశీల్దార్ ముందరే రైతులు వీఆర్వోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన తహాశీల్దార్ నీలకంఠారెడ్డి, మాట్లాడుతూ డిటి, ఇద్దరు వీఆర్వోలతో విచారణ నిర్వహించి అనర్హుల పేర్లని తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో ఏవైనా అక్రమాలు జరిగి ఉంటే వీఆర్వోపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో .రైతులు శివ, నాగమణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి వేడుకలకు ఎంపీకి ఆహ్వానం

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

ఈ నెల 20వ తేదీ జరిగే వాల్మీకి జయంతి వేడుకలకు రావాలని పరిగి మండలం కాలువపల్లి గ్రామానికి చెందిన వాల్మీకి సంఘ నాయకులు ఎంపీ బికె. పార్థసారధిని కోరారు. పట్టణంలోని హిందూపురం పార్లమెంట్ సభ్యుల కార్యాలయంలో బుధవారం ఎంపీని కలిసిన నాయకులు వాల్మీకి జయంతి వేడుకలకు ఆహ్వానించారు. అదేవిధంగా హిందూపురం పట్టణం ముదిరెడ్డిపల్లి, మేళాపురం (ధన్ రోడ్డు) కురుబ సంఘం నాయకులు ఎంపీని మర్యాద పూర్వకంగా కలసి కురుబ కళ్యాణ మండపం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా వంద శాతం పన్నులు వసూలు చేయాలని, ఇందులో ఎవరు నిర్లక్ష్యంగా వ్యహరించిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం తన చాంబర్‌లో నోడల్ అధికారులు, సూపర్ వైజర్లతో పన్ను వసూళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు ప్రతి రోజు నిర్దిష్ట లక్ష్యం ఏర్పాటు చేసుకుని, ఆ లక్ష్యం పూర్తి చేయాలన్నారు. నోడల్ అధికారులు, సూపర్ వైజర్లు వారి పరిధిలో ఉన్న సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో సమీక్షలు నిర్వహించి వారి లక్ష్యం పూర్తి అయ్యే విధంగా చూడాలన్నారు. దీంతో పాటు మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

18 నుంచి రీసర్వే సమస్యలపై గ్రామసభలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రభుత్వ ఆదేశాముల మేరకు రీసర్వే జరిగిన 161 గ్రామాలలో ఈనెల 18 నుండి నవంబర్ 4 వరకు శ్రీ సత్యసాయి జిల్లాలో రీసర్వేలో గల సమస్యలపై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు జిల్లా సర్వే, భూ రికార్డుల సహాయ సంచాలకులు విజయశాంతి తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేవారు. ఆయా గ్రామసభలకు మండల తహాశీల్దార్ , రీసర్వే డిప్యూటీ తహాశీల్దార్, మండల సర్వేయరు, గ్రామ రెవిన్యూ అధికారి, గ్రామ సర్వేయరు, గ్రామ రెవిన్యూ అసిస్టెంట్ హాజరవుతారని చెప్పారు. రైతులు వారి భూములకు సంబంధించి కొలతలలో గానీ విస్తీర్ణం లో గానీ సమస్యలు ఉంటే అర్జీ రూపంలో గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.